


# మంకీ బ్రాండ్

గ్రూములమ్మబడును. దసరా, దీపావళీ సందర్భంగా ఆకర్షవంతమ్మైన తగ్గింపు ధరలు రెండు లేక మూడు గ్రూములను సెలెక్టు చేసిన వారికి ఒక గ్రూము ఉచితము. గ్రూములకి లేబెల్సుంటాయి. యే పరిషత్తు యేమిచ్చిందీ, యే భిషఫ్ యేమని సర్టిఫై చేశాడు ప్రైస్ టాగ్ పేరుకే. మీ మీ తాహతులను బట్టి హార్డ్‌కాష్ చెల్లించవచ్చును. డ్రాఫ్ట్సు తీసుకొనబడవు. బాంకు ద్వారా స్వీకరించము. కొన్ని చెక్కులు బౌన్స్ అవుతున్నాయి. ఆ వ్యవహారం తల నెప్పి కిందికి వచ్చింది. గ్రూములను పసందు చేయండి ఆలశించిన ఆశాభంగమగును. బలేమంచి చౌకబేరము మించినన్ దొరకరు. సువిచారమేల చేయబూనరు? పౌరులారా సకలభాగ్యభోగ్యమైన బేరము. షరా: ఇల్లరికం కావాలంటే షావుకారును సంప్రదించవలెను. సంప్రదించు వేళలు. రాత్రి పదినుండి పన్నెండు వరకు. ఎసి వున్నది. పనిచేయు వేళలు. పొద్దున తొమ్మిదింటినించి మధ్యాన్నం ఒంటిగంట వరకు. సాయంత్రం అయిదింటినించి రాత్రి పదింటి వరకు దుకాణము తీసి వుండును. దూరము నుండి వచ్చు కస్టమర్స్ సౌకర్యమునకు, చిన్న స్కేల్ రెస్టారెంటు బేకరీ రన్ చేయబడుచున్నవి. ఏంటీ రూమ్, క్లోక్ రూమ్, వాస్ రూమ్సు ఉన్నవి. గుడుగుడుమని గుసగుసలాడేందుకు వ్యవహారం సెటిల్ చేసుకునేందుకు స్పెషల్ గదులు ఫర్నిచర్ కంబెడ్సుతో వున్నాయి. అవసరమైతే గ్రూము, మీరు పసందు చేయగానే, హర్డ్‌కాష్ చెల్లించగానే మీ వెంటవచ్చును.

గమనిక:- ఆ తరవాత గ్రూము రెస్పాన్సిబిలిటీ మీదే. ఇలా దూరదర్శన్ మీద ముఖపత్రాలతో సహా పబ్లిసిటీ యిచ్చారు. కరపత్రాలు పంచిపెట్టించారు. బల్లమీద వ్రాయించి దుకాణం ముందుంచి లైట్లుపడే శ్రద్ధ వహించారు షావుకారుగారు. ఆ పబ్లిసిటీ చూసిన అమ్మమ్మ కళ్లూ పళ్లూ మెరిసినై వెలగల కంటి అద్దాలు, మంకీ బ్రాండ్ నల్లపళ్లపొడి వాడుతూ పళ్ళు గట్టిగానూ, మెరిసేట్టూ కాపాడుకుంటూ వచ్చింది అమ్మమ్మ. ఆమె వయసు చూచాయగా లెక్కగట్టగలిగిన

వారు తొంభైకీ నూరుకి మధ్య నిర్ణయించి, ''కట్టుడు పళ్లా బామ్మగారూ'' అనడిగితే ఈమని నవ్వి ''అలా కనబడుతున్నాయా మనమడా?'' అంటుంది నడ్డిన చేయిపెట్టుకు నిలబడిన అమ్మమ్మ. ''మూడోకాలు లేకుండానే, వంగకుండానే నిటారుగా నడుస్తుంటే ''మూడు కాళ్లముదుసలి కాదేమో. అయినా తల ముగ్గుబుట్టే'' అనేవి చికిత్సలో పడ్డారు జవ్వనులు.

విశాల అమ్మమ్మకి కొడుకులు మొహం మొత్తగా చివరికి కూతురు పుట్టింది. అమ్మమ్మకు బాల్య వివాహం జరిగి, టీనేజరప్పుడే అత్తింటికెళ్లి పదహారోయేటే తల్లి అయింది విశాల అమ్మమ్మ మనమరాల్నెత్తుకోవాలనే వుబలాటంతో కూతురు రాజీ బికాం చదువుతుండగానే పెళ్లి చేసింది. మనమరాలైతే పుట్టిందిగానీ కూతురు పురుట్లోనే సంధి పుట్టిపోయింది. అమె దుఃఖ నివారణకి మందుగా విచారణ జరిగింది. స్టెరిలైజ్ చేయనివి వాడారుట. అంటీబయోటిక్స్ లేవుట. మరో పదిమంది తన కూతురు రాజీకి తోడుగా వెళ్లారని విని ఎక్కిళ్లుపెట్టి వూరుకున్నది విశాల అమ్మమ్మ. పసికందును పెంచుతూ, గుండెలకత్తుకుంటూ కడుపుకోత మరిచింది విశాల అమ్మమ్మ. దాని పేరు సంపంగి అనిపెట్టి అల్లారు ముద్దుగా , కాలు కింద పెట్టనీయకుండా పెంచుకొచ్చింది విశాల అమ్మమ్మ. దానికి పెళ్లీడొచ్చే టైముకి విశాల అమ్మమ్మ యీ ప్రకటన, యీ పబ్లిసిటీ చూసింది. ముద్దు వచ్చినప్పుడే చంకకెక్కవలె అనాయాసంగా గ్రూము లభిస్తున్నప్పుడే పెండ్లి చేయవలె అనుకుని ఎన్నిక చేసి, బ్రాండ్ చూసి, ఆ బ్రాండే తనదంతాలను నేటివరకు ధృడంగా వుంచుతాన్నాయి, అనే నమ్మికతో పెళ్లి ముగించింది విశాల అమ్మమ్మ.

పెళ్లి జరుగుతుండగా, మూణ్ణిద్దరా, మనుగుడుపులూ, వ్రతం పదహారు రోజుల పండగా ముగిసేలోపునే సంపంగి, తనకు అమ్మమ్మ విశాలమ్మ యేబ్రాండ్ వానిని యెన్నిక చేసిందో గ్రహించిందిగానీ కొత్త గాదూ, అందుకని మన్నించింది.

అత్తవారి వేపు వారొచ్చినప్పుడు యెటోపోయి వస్తుంటే, ''పాతు దొరికిందీ అన్నది బావగారి పిల్లలతో ''పాతంటే'' అనడిగాడో ఇంటరు వెలిగొస్తున్నబ్బాయి.

''నువ్వు మా బాబాయి కన్న పెద్దంటున్నారే? నీ కెన్నేళ్లు? అదేం పేరూ? ఆ రంగులో వున్నావనా?'' మీ అమ్మకి పురుట్లోనే సంధి కొట్టిందిగా'' అన్నాడు.

వదినగారు సరేసరి, ''నా కసలు యిల్లు వదిలి వచ్చేందుకే వీలుకాదు. మా ఆయన్నెవరు కనిబెట్టి వుంటారు? దత్తు అన్నమాటేగానీ, ఆస్తంతా కర్పూరం వెలిగించారు. కన్నత్తా, పెంపుడత్తా, మైనరుకి తెలీదు. యెక్కడ సంతకం పెట్టమంటే కిమ్మనకుండా అక్కడ చేవ్రాలు చేశాడు'' అని తలాడిస్తూ చెప్పింది.

అత్తగారేమో, ''పిల్లవాడు నుగారుతూ బావున్నాడు గదా అని చూస్తుంటే యేదో పెట్టుకొచ్చి సన్నగా పూతికపుల్లలాగా అయి చిక్కి శల్యావశిష్టమౌతాడు'' అని తన మనమని మీద వాత్సల్యం తోడుకోడలుతో చెప్పినట్టు చెప్పింది.

నీళ్ల మీద నూనె తేలినట్టు, పిల్లలు కలిగి పెద్దాళ్లవుతుంటి మగని బ్రాండ్ తెలిసిపోయింది. స్పోర్టివ్‌గా తీసుకున్నది సంపంగి. అమ్మమ్మ యెన్నిక అని గౌరవించింది. ఒక్కోసారి వశం తప్పి ఉద్రేక పడేది. మరోసారి సహనం చచ్చి వుడాయిద్దామనుకున్నది సంపంగి.

యేదో చెప్తుంటే ప్రేమకలాపం అని చూస్తూ నిలబడి విన్నది. వాచ్‌మన్‌కి మన కాంపౌండ్‌లో పాకలో వుండమని జాబ్ యిచ్చాము,

''బాబూ మీ యింటి ఆవరణలో పాకలో కొచ్చాకే మంచి నిద్ర తీస్తున్నామందరము. అది వరకెక్కడున్నా దొంగలు, రోజూ యిరుగుపొరుగుతో మాయాలి కీచులాటా, అప్పులూ రోగాలూ, జీతం చాలేది గాదు. మీటరు ఛార్జి, కొళాయి ఛార్జి, యింటద్దె అలా చాలా కోసేవారు జీతంలో'' అని మెచ్చి థాంక్సు చెప్పాడు. వాళ్లకెట్టి అమర్యాదా జరక్కుండా చూశాడు. మేనమామలున్నారు గాని అమ్మమ్మ నీ వద్దేవుండేగా అన్నట్లు మాట్లాడారు. తండ్రివేపువారూ అంతే. అందరివీ పైపై మెరుగులే. అందరి అభిమానాలూ మలామా చేయబడిన నగలే.

ఆనాడు అమ్మమ్మ గొణుగుతూ, పెదవులు కదిలిస్తూ యేదో వెతుక్కుంటున్నది. సంపంగి పెద్దకొడుకు సిసింద్రీ ''గ్రాండ్‌మా! ఏమిటి వెతుక్కుంటున్నావు నాల్రోజులనించీ'' అనడిగాడు.

''నాన్నా! సిసింద్రీ! నారు ద్రాక్షల తావళం కనపడలేదురా. యెర్రని చిన్నవి రుద్రాక్షలు. మేలిమి బంగారంతో చుట్టించారు తాతగారు, దాని కొసకి పూసపెద్ద ముత్యం, నా తల్లి యిచ్చింది. పగడాలేమో, నా మరదలిచ్చింది. నా మేనత్త కాసికాయ గుళ్ల గొలుసు తెగితే అమ్మమ్మ తూ కాసిని బంగారు గుళ్లు నాకిచ్చింది అన్నీ కలిపి తావళం అయింది'' అన్నది.

''అది నీదా గ్రాండ్‌మా. డాడీ బ్రాండ్ తెలియదూ? మా పెద్ద మేనత్త వచ్చినప్పుడు, అటువంటి తావళం తనకు లేదనీ యిప్పించమనీ ముద్దులు గుడిచింది. డాడీకి దాని విలువ తెలియక, నకిలీదనుకుని అదే యిచ్చి వుండాలి. డోంట్ వరీ గ్రాండ్‌మా. నే తెచ్చిస్తా. బురిడీ వేసేవారిని బురిడీ వేసే గెలవాలి'' అని కౌగలించుకుని ధైర్యం చెప్పాడు. సిసింద్రీ చెల్లెలు వాసంతి, ''నీ మెళ్లోనే వుంటుందిగా హమేషా. యెలా యిచ్చి వుంటాడు డాడీ'' వాసంతి స్కూలు ఫైనల్సుకు వచ్చింది.

''స్నానానికెళ్తూ, వంటింట్లో అల్మరలో దేవుని ముందుంచి వెళ్లాను. వస్తూనే పనిలో మునిగి మరిచాను చిట్టీ. గుర్తు రాగానే చూస్తే లేదక్కడ. యెక్కడుంచి మరిచానో అని వెతుకుతూనే వున్నా''.

2

సిసింద్రీ మేనత్తను చూడవెళ్లి ప్రేమ ఒలకపోశాడు. పళ్లు పూలూ కొని యిచ్చాడు. పనిలో సాయపడ్డాడు. ''అత్తా! నీ స్టౌకి స్పేర్ వత్తులుండాలని రెండు కట్టలు ప్యాకేజీలు తెచ్చా. వంటింట్లో అల్మరలో యెదురుగా పెడ్తున్నా. బావ పట్నం నించి వచ్చి చూసి వెళ్లాడా? వదినల్ని చూసొచ్చావా బందరేగా'' అని కబుర్లాడుతూ పూసుకు తిరిగాడు. వడియాలు పెట్టటంలోనూ, గుడ్డమీద యెండిన సగ్గు వడియాలు, బియ్యపు రవ్వ వడియాలూ పీకంటలోనూ సాయపడ్డాడు. తెల్ల గుమ్మడి మురబ్బా చేసి చూపాడు. అత్త యిష్టదైవం ఆంజనేయుడు. వాని పాదాల ముందునకిలీ తావళముంచి, గ్రాండ్‌మా అసలు తావళం నేర్పుగా తన జోబీలోకి సరఫరా చేసి ఆంజనేయునికి నవ్వుతూ

నమస్కారం చేశాడు సిసింద్రీ తమ వూరు రైలెందుకున్నాడు.

''గ్రాండ్‌మా! ఇదేనా నీ తావళం? చూసుకో'' అన్నాడింటికొచ్చి.

''నాదేరా సిసింద్రీ! యెలా తెచ్చావోగానీ, కాసికాయ గుళ్లు రెండు సొట్టలు పడ్డాయి. పగడం అరిగి వదులైంది. అవే గుర్తులు'' అని ఆనందభాష్పాలు రాలుస్తూ, మనమడి ముందు పళ్లెముంచింది డైనింగ్ టేబిల్ మీద. కొబ్బరి లౌజు. హల్వా ముక్క జీడిపప్పున్నది చేగోడీలు, మినప సున్నివుండ, జీడిపప్పు పకోడీలు, కాజా ముక్క, ఐసువాటరుంచింది పక్కన.

వీధి గుమ్మం బయట మెట్లమీదున్నాడు ఆఫీసరు. చీడీలకి కొద్దిదూరంలో వాచ్‌మన్ భార్యా దాని చంకలో యాడాది పిల్లాడు.

''బుడ్డోడికి, రగత బేదులౌతున్నాయి. కూసింత వెన్న యియ్యి తినిపిస్తే తగ్గుతాయంటే, అమ్మలేదు పొమ్మన్నది. తల్లి సంపంగి, '' ఇవాళ పొద్దున్నే వెన్న కరగేసుకున్నా'' అన్నది. డాడీ, ''కొంచెం వుంచితే అవసరానికిచ్చేవాళ్లంగా అంతా యెందుకు కరగేశావు'' అంటున్నాడు.

సిసింద్రీ తన ముందున్నవి వదిలేసి వెళ్లి, ఫ్రిజ్ తీసి అమ్మూల్ వెన్న ప్యాకెట్ తీసికెళ్లాడు వాకిట్లోకి.

'' ఇదుగో డాడీ. ఈ వెన్నలో ప్రోటీన్సుంటాయి. డీసెంట్రీ తగ్గేదాకా బుడ్డోడి చేత తినిపించచ్చు. ఇది ఇస్తున్నా'' అని రమణమ్మకిచ్చాడు చీడీలు దిగి వెళ్లి. తలతాటిస్తూ మూతివిరుస్తూ వెళ్లింది రమణమ్మ.

''వాడికున్న ప్రెజెన్సాఫ్ మైండ్ నీకు లేకపాయె'' అన్నడాఫీసరింట్లోకి వచ్చి.

''మీకుందిగా'' అన్నది రాని నవ్వునవ్వుతూ సంపంగి.

3

దసరా యెంజాయ్ చేయాలని సంపంగి మేనమామల పిల్లలు వచ్చారు. కైలాసగిరీ, స్టీలు ప్లాంటూ, బిహెచ్‌పివీ, జింక్ ప్లాంటూ చూసి వచ్చారు. డి.డి. మీద లేట్ నైట్ ఫిల్మ్స్ చూస్తున్నారు. వారిలో యిద్దరు వచ్చేప్పుడు టెక్స్ తెచ్చుకుని

రాత్రిళ్లు నిశ్శబ్దంగా వున్నప్పుడు చదువుకుంటున్నారు. ఒకడు మెడికో రెండో అబ్బాయి సి.యె. మెడికో పుస్తకం మాయమైంది. వాసంతి, ''రాజ్. చికాకు పడకు. అన్నతో యిపుడే చెపుతా. రాత్రికి తెచ్చిస్తాడు. డాడీ ఫ్రెండు కొడుకు శాయిరాం వస్తున్నాడు శాయిరాం మెడికోయే. మా డాడీ అందర్నీ ముద్దు చేస్తాడు. ఒక్కోసారి ఆ ముద్దు మంకీయిజమ్ లాగా వుంటుంది. డాడీ మంకీ బ్రాండ్'' అని నవ్వించి వీపుమీద రాచింది.

తల్లి కేక వేసింది. ''వాసంతీ వడ్డించేస్తున్నా లంచ్ టైమ్'' అన్ని ప్లేట్లల్లో వేడిపదార్థాలు. మధ్య గిన్నెలో వెజిటబుల్ పలావ్. దానిలో గరిట, పులిహోర పళ్లెం దానిలో స్పూన్. వైట్ రైస్ ప్లేటు. బజ్జీల ప్లేటు. బొండాల ప్లేటు. పూర్ణాలు విడిగా చిన్నబల్లమీద ఒక ప్లేటులో అన్నీ అమర్చి వుంచింది.

ఆఫీసరుతో సహా అంతా డైనింగ్ టేబిల్ ముందున్నారు. ఆపీసరు నవ్వు మొహంతో అడిగాడు. '' ఆ ప్లేటెవరికీ?'' సంపంగీ నవ్వుతూనే అన్నది. ''అభ్యాగతి రావచ్చు. లేదా డైనింగ్ రూమ్ కిటికీ వద్ద ఆకలిగొన్న మొహం కంటబడచ్చు''.

ఆఫీసరు స్పూన్ అందుకుని తలెత్తాడు. కిటికీ వద్ద డ్రైవరు పాతికేళ్లవాడు కంటబడ్డాడు. అంతే. స్పూను బల్లమీదుంచి, తన ముందున్న ప్లేటు దానిలో నిండివున్న ఆహారంతో సహా అందుకుని లేచి వెళ్లి డైనింగ్ రూమ్ తలుపు, దొడ్డివేపుది తీసి అక్కడున్న డ్రైవరు కిచ్చి వచ్చాడు. ఐస్ వాటర్ బాటిల్ దాని మీద గ్లాసూ గూడా యిచ్చి వచ్చేప్పటికి, యెదురుగా వడ్డించిన ప్లేటూ మంచినీళ్ల గ్లాసూ వున్నాయి.

'స్పూను ఫోర్కు మరిచారే నేనిచ్చిరానా'' అంటున్నది సంపంగి. విననట్టు, వినబడినట్లు, ''నువ్వుగూడా కూచో రాదూ, సరదాగా కబుర్లాడుతూ తిందాము'' అన్నాడాఫీసరు.

''తారా, రీటా, వాసవి, మిసెస్ జాన్సన్ ఫోన్ చేశారు. వాళ్లు చేసినవి వాళ్లు తెస్తారట. ఇవాళ మనం కలిసి తిందాము అని ఫోన్ చేశారు'' అని కిచెన్‌లోకి 4

వెళ్లిపోయింది. సిసింద్రీ కబుర్లాడుతూ అన్నం తింటూ ఖుషీగా వుండి అన్నాడు. ''డాడీ! మీ ఫ్రెండ్ బిడి ఓ గారి అబ్బాయి పేరేమిటి? వాళ్లిల్లు దగ్గరేనా? అపార్ట్‌మెంట్ నంబరెంత? మన రిలెటివ్ అనాటమీ టెక్స్ట్ బుక్ తెచ్చుకున్నాడు. రాత్రిళ్లు తిరగేస్తున్నాడా పాఠ్యగ్రంధాన్ని. బహుశా ఆ పాఠ్యగ్రంథం అతనికి యిచ్చారేమో? మనం కొన్ని పన్లు అన్‌కాన్షస్‌గా చేస్తాంట మా ప్రొఫెసర్ చెప్పాడు'' తక్కినవాళ్లు చూస్తున్నారు.

''బాగా వూహించావు సిసింద్రీ ఐ ఎడ్మైర్ యు. డేవిడ్ పుస్తకాలు అరువు తెచ్చి చదువుతూ మెడిసిన్ పూర్తి చేస్తున్నాడు. బుక్ ఓనర్ వచ్చి బుక్ కావాలని తీసికెళ్లాడట డేవిడ్ యిప్పటికే రెండుసార్లు తప్పాడు అనాటమీ. వర్రీ అవుతుంటే వాడిగోడు విని నేనే యిచ్చా. పరీక్షలయాక దాంతో పనుండదిహ. రిటరన్ చేస్తాడు డేవిడ్. యేవిటి తొందర?'' అని తలొంచుకుని భోజనం కానిస్తున్నాడాఫీసర్. సిసింద్రీ వాసంతి వంకా మెడికో రిలెటివ్ వంకా చూసి నవ్వాడు.

లాబుక్స్, మెడిసిన్ బుక్స్ అద్దెకివ్వబడును. పాతవి అమ్మబడును అనే షాపుల వేపు వెళ్లి కావాల్సిన పాఠ్యగ్రంథం అద్దెకు తీసుకుని మోటార్ సైకిల్ మీద వెళ్లి డేవిడ్‌కిచ్చి, రిలెటివ్ బుక్ అడిగి తెచ్చేశాడు సిసింద్రీ.

ఆ రాత్రి రిలెటివ్‌కి అనాటమి గ్రంథం అందించి, సిసింద్రీ కూచుని నవ్వుతూ చెప్పాడు. ''నా చెల్లికి దాని టీచరు లెక్కలు చేసుకో అని లెక్కల పుస్తకమిచ్చింది. అది ఆవిడే పబ్లిష్ చేసింది. మా డాడీ ఆ పుస్తకం చెల్లికి చెప్పకుండా తన రిలెటివ్‌కి పరీక్షకు అప్పియర్ కాబోతున్నదని యిచ్చాడు. చెల్లియేడిచి టీచర్‌తో చెప్పి క్షమాపణ అడిగింది. ''డోంట్ క్రై మై చైల్డ్. ఇది తీసుకో. పబ్లిషర్సు నాకు కొన్ని కాపీలు ఫ్రీగా యిస్తారు. మీ డాడీని యెంజాయ్ చేస్తున్నావు. గుడ్ గళ్. ఆ పుస్తకం తిరిగి నీకు చేరితే నాకిచ్చేయి. నేను దాని మీద ఆశీస్సులు అని సంతకం చేశాను'' అని వీపుతట్టి నవ్వించి పంపింది.

రిలెటివ్ సిసింద్రీని మెచ్చి థాంక్సు చెప్పాడు.

సరస్వతీ పూజా కలశ స్థాపన అని డేట్ చూసి సంపంగి యిల్లంతా అలంకరిస్తున్నది. దుర్గాష్టమినాడు దీపాల పద్మం అమ్మవారి కెదురుగా కట్టింది. బీరువా కెలుకుతున్న సంపంగిని ఆఫీసరడిగాడు. ''యేమిటి కనపడలేదు''. ''లక్ష్మి అల్లిన కర్టెనూ కనపడలేదు. కాళీయమర్దనం క్రాస్‌స్టిచ్ చేసిన కర్టెనూ కానరాలేదు. నిన్నటినించీ వెతుకుతూనే వున్నా'' అన్నది.

''అవా? యెదురింటి సబ్ జడ్జీ భార్యా అడిగితే యిచ్చా. ఆమె వచ్చినప్పుడు నీవు చూపావుట'' అద్భుతం అన్నదామె. తెచ్చిస్తానన్నది. ఇవ్వలేదా యింకా? నెలైందే! ఇన్నాళ్లు పడుతుందా. అల్లటం కుట్టటం పెయింట్ చేయటం? నాకు తెలియదే అన్నాడు'' దేబెలాగా కనిపించాడాఫీసర్.

''పోనీ కొనుక్కో. డబ్బిస్తా. ఇంకా మహానవమి వున్నది'' అని రాజీబేరం పెట్టాడాఫీసర్.

''అక్కర్లేదు. వచ్చేయేడు నా కర్టెన్లతోనే యిల్లు అలంకరించుకుంటా. కాని కిచెన్‌లో గుర్తుగా పెట్టుకున్న స్టెయిన్‌లెస్ స్టీల్ జల్లెడ, ఏలకిపొడి నూరే చిన్ని అమాందస్తా స్టెయిన్‌లెస్ స్టీల్‌ది, నా మేనమామ యిచ్చిన కొత్త రకం గ్రైండర్, ఛిప్స్ కోరేదీ చిన్న సైజు ఓవెన్ ఏవీ? కిచెన్‌లో దూరి చొరవగా చనవుగా అడుగుతుంటే యిచ్చేస్తున్నారన్నమాట'' అని తడిఅయిన కళ్లతో నవ్వుతూ అడిగింది.

''యెవరూ కిచెన్‌లో దూరలేదు. మెయిడ్‌నో, ప్యూన్నో పంపితే యిచ్చా. ఇవాళ పంపుతామని ఫోన్ చేశారు'' అంటుంటే సంపంగి యేడుపూ నవ్వు కలిపింది.

''బ్రాండ్ ప్రూవ్ అయిందే? అమ్మమ్మకి నచ్చిన బ్రాండ్ అది. నాది కాదు'' అంటూండగా, అమ్మమ్మ విశాలమ్మ రానే వచ్చింది. తులసికోట దగ్గర దీపముంచి తులసికోటలో మట్టి కొంచెం మొహానికి రాచుకుంటూ వచ్చింది. దొడ్లోకన్నీ ప్రశ్నావళీ జవాబులు వినపడుతూనే వున్నాయి.

''తప్పమ్మా! సంపంగీ, మగడూ, వుద్యోగస్తుడూ ఆఫీసరూ గదూ

అబ్బాయిా! రోగిష్టి గాదూ, సోమరిగాదూ, పిసినిగొట్టుగాదూ, బిడ్డల తండ్రీ, మన్నించాలమ్మా సంపంగీ! అన్ని బ్రాండ్స్‌లోనూ లోపాలుంటాయి మరీ అనుకూల బ్రాండ్ దద్దమ్మలాగా కనిపిస్తాడు'' అని లాక్కెళ్తుంటే సంపంగి నవ్వుతూ ఆఫీసర్ని చూస్తూ అమ్మమ్మ వెంట వెళ్తూ కన్నీరు వేళ్లతో నెట్టేసింది. అత్తగారి పేరు ఆంజనేయమ్మ అని గుర్తు వచ్చింది ఆడపడచు పేరు హనుమావతి. భర్త పేరు హనుమంతరావ్. పెద్దాడపడుచు మరిది పేరు మారుతీరావ్. మామగారి పేరు రాంబంటు. లేక లేక పుట్టాడుట వాళ్లమ్మకు. ఆమె ఆ పేరు పెడతానని ఇలవేల్పు ఆంజనేయునికి మొక్కుకున్నదిట. వూరి పేరు హనుకొండ. ఇంటిపేరే కోతివారు.